

చిన్నారులకు పోషకాహారం అందించాలి

మంచాల, ఫిబ్రవరి 13 : చిన్నారులకు పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆరుట్ల ఎంపీటీసీ చీరాల రమేష్ అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. మంగళవారం ఆరుట్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో 5 ఏళ్ల లోపు చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం వేసే కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

- రేషన్ కార్డే ప్రామాణికం అంటున్న అధికారులు
- పదేళ్లుగా కొత్త కార్డులు ఇవ్వని సర్కారు
- కార్డులు లేని కుటుంబాలు వేలల్లో...
- వర్తిస్తుందా... వర్తించదా?
- పథకాల అమలుకు ఇంటింటి సర్వే
- వివరాల ధ్రువీకరణకు పరిశీలనా సిబ్బంది
- వివరాల్లో తప్పులు ఉంటే సవరించి యాప్‌లో నమోదు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీ పథకాల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం కింద ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీని అమలు చేస్తుండగా, మరో రెండు గ్యారంటీలను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అమలుకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అర్హులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ రెండు గ్యారంటీలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు తెల్లరేషన్ కార్డు వివరాలను తీసుకోవాలన్న ఆదేశాలతో రేషన్‌కార్డు లేని కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు స్పష్టత రావడంతో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ రెండు గ్యారంటీలు వర్తించే అవకాశం లేదనే విషయం స్పష్టమవుతుంది.



గ్యారంటీ ఉందా?

గృహజ్యోతి, మహాలక్ష్మి లబ్ధిదారుల్లో గుబులు

ఆశగా ఎదురు చూపులు





వికారాబాద్,(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 13: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో ఉమ్మడిరంగారెడ్డి జిల్లాలో భారీ సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఆరు గ్యారంటీలకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న తెల్లరేషన్ కార్డుదారులు మాత్రమే అర్హులనేది ప్రకటించకపోవడంతో పేదల నుంచి ధనవంతుల వరకు, ప్రైవేట్ ఉద్యోగుల నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వరకూ అందరూ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాలకు తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్న నేపథ్యంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి తెల్లరేషన్ కార్డు లేని కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్తరేషన్ కార్డుల కోసం జిల్లాలో వేలాది పేద కుటుంబాలు సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నాయి. ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాలే దరఖాస్తు చేసుకోవాలనేది స్పష్టత ఇవ్వకుండా.. తీరా దరఖాస్తు చేసుకున్న తరువాత తెల్లరేషన్ కార్డును అర్హతగా గుర్తించేలా ఆదేశాలు జారీ చేయడం ఎంత వరకు సమంజసమని రేషన్ కార్డులు లేని కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. తెల్లరేషన్ కార్డును అర్హతగా ప్రామాణికంగా తీసుకోనున్నట్లు స్పష్టత రావడంతో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ రెండు గ్యారంటీలు వర్తించే అవకాశం లేదనేది తెలుస్తోంది. తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాలకే ఈ రెండు పథకాలు వర్తించనున్నాయనేది స్పష్టమవుతోంది.

కొత్త పింఛన్ల మంజూరు ఎప్పుడో?

గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. అయితే నెలలు కాదు... సంవత్సరాలు ఎదురు చూశారు. మరి కొందరైతే పింఛన్ కోసం ఎదురు చూశారు. కనీసం ఈ సర్కారైనా పింఛన్ తొందరగా మంజూరు చేయకపోతుందా అని ఆశగా ఉన్నారు. కొత్త ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీల్లో భాగంగా పింఛన్లకు సంబంధించి చేయూత పథకం కూడా ఒకటి. అర్హులైన వారు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి ముందుగా కొత్త పింఛన్లు మంజూరు ఇవ్వాలని పలువురు వేడుకుంటున్నారు. గడిచిన రెండేళ్ల నుంచి దరఖాస్తులు స్వీకరించినా మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసరా పింఛన్ పథకాన్ని చేయూతగా మార్చింది. ఉమ్మడి జిల్లాలో గతయేడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి ఆర్జీలు స్వీకరించారు. పింఛన్ కోసమే వేలాది దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా మంజూరు చేస్తే వారికి చేయూత ఇచ్చినట్టవుతుంది.

ముందుగానే రేషన్‌కార్డులు ఇస్తే..

కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలకు తెల్ల రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం భావించి ఉంటే, ముందుగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేసిన తరువాతనే రూ.500లకు వంటగ్యాస్, 200యూనిట్ల ఉచిత కరెంట్ పథకాల అమలుకు లబ్ధిదారులను ఎంపిక ప్రక్రియ చేపట్టి ఉంటే బాగుండేదని అభిప్రాయ పడుతున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఇంటింటికీ వెళ్లి విద్యుత్ మీటర్ నెంబర్, యజమాని వివరాలు, ఆధార్ కార్డుతో పాటు రేషన్ కార్డు నంబరు కూడా తప్పనిసరిగా నమోదు చేస్తుండడంతో తాము రూ.500లకు వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలు తమకు వర్తించవేమోనన్న ఆందోళన రేషన్‌కార్డులు లేని కుటుంబాల్లో వ్యక్తమవుతోంది. వివాహమై కొత్తగా కుటుంబాలు ఏర్పాటైన వారితో పాటు రేషన్ కార్డులు లేని వేలాది కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

రెండు గ్యారెంటీల అమలుకు కసరత్తు

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం కింద ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సాయం రూ.10లక్షల వరకు పెంపు హామీలను అమల్లోకి వచ్చాయి. మరో రెండు గ్యారంటీలను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. గృహజ్యో తి పథకం కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్ హామీతో పాటు మహాలక్ష్మి పథకం రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసే విధంగా సంబంధిత శాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ రెండు పథకాలకు తెల్ల రేషన్ కార్డు ఉన్న వారినే అర్హులుగా పరిగణిస్తున్నారు. వంటగ్యాస్ కనెక్షన్ దారుల వివరాలు ధ్రువీకరించుకునేందుకు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే అర్హులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌తో పాటు రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబంధించి గతనెలలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని ఆ వివరాలను ప్రజాపాలన పోర్టల్‌లో నమోదు చేసిన విషయం తెలిసిందే.

యాప్‌లో వివరాల నమోదు

రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ పథకం కోసం వికారాబాద్ జిల్లాలో 2,27,773 మంది దరఖాస్తు చేసుకోగా, రంగారెడ్డి జిల్లాలో4,32,676 దరఖాస్తులు వచ్చాయి. 200యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం వికారాబాద్ జిల్లాలో 2,09,560 మంది దరఖాస్తు చేసుకోగా, రంగారెడ్డి జిల్లాలో 3,99,866 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అర్హుల వివరాలను నమోదు చేస్తున్నారు. కరెంట్‌బిల్లు, తెల్ల రేషన్‌కార్డు (ఆహార భద్రతా కార్డు), ఆధార్, మొబైల్ నంబర్ వివరాలను ఇంటింటికీ తిరిగి నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఆరు రోజుల కిందట ప్రారంభం కాగా, రూ.500లకు వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ పథకం కోసం గురువారం నుంచి వివరాల ధ్రువీకరణ, తప్పుల సవరణ ప్రక్రియ చేపడుతున్నారు. ఇంటింటికీ తిరిగి వివరాలను ధ్రువీకరించుకునేందుకు గ్రామాల్లో, మునిసిపాలిటీల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి అన్ని వివరాలను సరిచూసుకుని తప్పులు ఉంటే సరిచేసి నమోదు చేస్తున్నారు. నమోదు ప్రక్రియ పూర్తయిన తరువాత 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ పంపిణీ పథకాలను అమల్లోకి తీసుకురానున్నారు.

దరఖాస్తుల వెల్లువ

వికారాబాద్ జిల్లాలో 2,03,123, రంగారెడ్డి జిల్లాలో 12,30,000 వేల గృహ వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ కనెక్షన్లలో సాధారణ కనెక్షన్లు వికారాబాద్ జిల్లాలో 1,58,121 ఉండగా, దీపం పథకం కనెక్షన్లు 26,502, ఉజ్వలపథకం కనెక్షన్లు 18,300 ఉన్నాయి. 21 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా జిల్లాలో 70 వేల వరకు సిలిండర్ల డిమాండ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, జిల్లాలో గృహసంబంధమైన విద్యుత్ కనెక్షన్లు 2,39,409 ఉన్నాయి. ఈ కనెక్షన్లలో 1,96,227 మంది కనెక్షన్‌దారులు 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్నట్లు టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు గుర్తించారు. వికారాబాద్ నియోజకవర్గంలో 71,692, పరిగి నియోజకవర్గంలో 37,815, కొడంగల్ నియోజకవర్గంలో 24,042, తాండూరు నియోజకవర్గంలో 62,678 కనెక్షన్ దారులు 200యూనిట్లలోపు కరెంట్ వినియోగిస్తున్నట్లు తేల్చారు. 200యూనిట్ల ఉచిత కరెంట్ కోసం జిల్లాలో 2,09,560 మంది దరఖాస్తు చేసుకోగా, టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారుల లెక్కల ప్రకారం 1,96,227మంది అర్హులు ఉన్నారు. రూ.500 లకు వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడితేనే అర్హుల ఎంపిక విషయంలో స్పష్టత రానుంది.

దరఖాస్తులు	ఆహార భద్రతా కార్డులు	వంటగ్యాస్ సిలిండర్ (మహాలక్ష్మి)	ఉచిత విద్యుత్ (గృహజ్యోతి)	వంట గ్యాస్ (గృహ కనెక్షన్లు)
వికారాబాద్	2,41,185	2,27,773	2,09,560	2,03,123
రంగారెడ్డి	5,24,976	4,32,676	3,99,866	12,30,000

మద్యం ప్రియులకు అడ్డాగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు



డబుల్‌బెడ్‌రూం ఇంటి ఆవరణలో పడి ఉన్న బీరు సీసాలు

నందిగామ, ఫిబ్రవరి 13: నిలువ నీడలేని అభాగ్యుల కోసం ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు మందు బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. నందిగామ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ భూమిలో గత ప్రభుత్వం 120 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించింది. లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు వాటిని కేటాయించినప్పటికీ ప్రారంభ సమయంలో ఎన్నికలు రావడంతో కేటాయింపు వాయిదా పడింది. దీంతో వాటి పంపిణీని అధికారులు కూడా గాలికి వదిలేశారు. ఇదే అదునుగా భావించిన మద్యం ప్రియులు, పోకిరీలు వాటిలో మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సీసీ కెమెరాలు బిగించకపోవడంతో వారు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. పక్కనే పోలీస్‌స్టేషన్ ఉన్నా కూడా ఈ కార్యకలాపాలకు కేంద్రంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు మారడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు వారి ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి

- జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు
- చేవెళ్లలో విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సుశీందర్‌రావు

చేవెళ్ల, ఫిబ్రవరి 13 : పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ఒత్తిడికి గురి కాకుండా పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ద్వారానే పేదరికాన్ని నిర్మూలించవచ్చునన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలివ్వాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 13 : అర్హులందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు పంట అనుబంధ రుణాలు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రుణాలను అర్హులైన పేద ప్రజలకు మంజూరు చేయాలని సూచించారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లను మంజూరు చేయాలన్నారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు రూపొందించి నిర్దీత గడువులోగా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాల రుణ పరిమితిని పెంచాలని, ఇచ్చిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులు వార్షిక సంవత్సరం ముగిసేలోగా వారి లక్ష్యాలను అధిగమించాలన్నారు. రైతులకు పంట, అనుబంధ రుణాలతో పాటు, డెయిరీ, పౌల్ట్రీ, తదితర యూనిట్లను మంజూరు చేయడం ద్వారా రైతులకు రెండు రకాల ఆర్థిక ప్రగతి పెరుగుతుందని కలెక్టర్ అన్నారు. బ్యాంకుల వారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతీమాసింగ్ డిజిటల్ ఇండియా పవర్ టు ఎంపవర్ (డిజిటల్ సేవా మోడల్ సీఎస్‌సి సెంటర్) పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎల్డీఎం జి.కుసుమ, ఆర్బీఐ అధికారి ఎకె.కల్పోరి, జీఎండీఐసీ జె. రాజేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, గిరిజన శాఖ అధికారి రామేశ్వరీదేవి, మెప్మా పీడీ శంకర్‌సింగ్, సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు లీగల్ సెల్‌ను సంప్రదించండి
- జిల్లా లీగర్ సెల్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

షాద్‌నగర్, ఫిబ్రవరి13 : విద్యార్థులు చదువుల పట్ల మనోధైర్యంగా ఉంటే ఎలాంటి ఒత్తిళ్లనైనా జయించవచ్చని జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర విద్యార్థులకు సూచించారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ధర్మ సేవా సంస్థ సహకారంతో మత్తు పదార్థాలు, వాటికి దూరంగా ఎలా ఉండాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి ఇందిర మాట్లాడుతూ విద్యార్థులు తాము పడుతున్న ఒత్తిడిని దూరం చేసుకునేందుకు తప్పుడు దారులు వెతుకుతుంటారని. ఇలాంటి తరుణంలోనే జీవితాలను నాశనం చేసుకునేందుకు కూడా వెనుకాడరని చెప్పారు. మానసిక ప్రశాంతతో ఉంటే అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని విద్యార్థులకు సూచించారు. మానసిక ఒత్తిడిని జయించేందుకు న్యాయశాఖ నెలకొల్పిన లీగల్ సెల్‌ను సంప్రదిస్తే మీకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చి మానసిక ఒత్తిడిని అధికమించేలా కృషి చేస్తామని తెలిపారు. ధర్మ సేవా సమితి అధినేత నిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో వ్యాయామ విద్య, యోగా విద్య ద్వారా డ్రగ్స్‌కు అలవాటు పడిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి వాటికి దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, ధర్మ సేవా సమితి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీల వల్లే పాలమూరుకు అన్యాయం

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి

కేశంపేట, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలే పాలమూరుకు అన్యాయం చేశాయని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి ఆరోపించారు. కేశంపేట మండలం నిర్దవెల్లి, లేమామిడి, కాకునూర్, సుందరాపురం, కేశంపేట గ్రామాలలో మంగళవారం న్యాయ్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం షాద్‌నగర్‌లో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ తెస్తామని చెప్పి ఇక్కడి ప్రజలను మోసం చేసిందన్నారు. పాలమూరుకు నాలుకలేని ఎంపీ ఉండడంతో కేంద్రం నుంచి నిధులు తీసుకరాలేక పోయారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకోవడం, దాచుకోవడమే తప్ప ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. షాద్‌నగర్ ప్రాంతానికి కేంద్రం నుంచి నిధులు రావాలంటే పాలమూరు లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గత పాలకులు చేసిన తప్పులను క్షమించేది లేదని హెచ్చరించారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేదించారన్నారు. భూములను లాక్కోవడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఘనత బీఆర్ఎస్ పాలకులకే దక్కిందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ఆరాచకాలు భరించలేక, కాంగ్రెస్‌ను అక్కున చేర్చుకున్నారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18గంటల ప్రజా సేవకై పనిచేస్తున్నారని వివరించారు. ప్రజాపాలనలో అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం కాంగ్రెస్ గెలిస్తే షాద్‌నగర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వై. యాదయ్య యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, నాయకులు పల్లె ఆనంద్ రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, యెన్నం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాకునూర్‌లో చల్లా వంశీచంద్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు స్వాగతం పలుకుతున్న మహిళలు

కొడంగల్‌లో మినీ హజ్‌హౌస్, షాదీఖానా నిర్మించాలి


వినతి పత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13: కొడంగల్‌లో మినీ హజ్‌హౌస్, షాదీ ఖానా నిర్మాణం, కొడంగల్ పట్టణ శివారులోని షేక్‌సాహెబ్ పహడి దర్గా అభివృద్ధికి నిధులు మంజూర్ చేయాలని మైనార్టీ నాయకులు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం కడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ) ప్రత్యేకాధికారికి మైనారిటీ నాయకులు ఎస్‌ఎం.గౌసన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదేవిధంగా కొడంగల్ శివారులో కోస్గి రోడ్డులో గల షేక్ సాహెబ్ పహాడి దర్గాలో సౌకర్యాల లేమితో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. దర్గాకు వెళ్లేందుకు రోడ్డు తదితర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. దర్గాకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యాల కోసం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఆసీఫ్‌ఖాన్, ఎండీ.షాకీర్, సయ్యద్ అశ్వాఖ్, హమీద్‌అలీ, ఎండీ.రహీం, మౌలానా హఫీజ్ అబ్దుల్ కరీం, ఖాసీం, రుక్మోద్దీన్, సయ్యద్ ఇసాక్‌పాష, షేక్ సాబేర్, యం.ఏ.కరీం, ఎండీ.ఖదీర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

దౌల్తాబాద్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 87మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా తహసీల్దార్ విజయ్‌కుమార్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, నాయకులు వీరన్న, వెంకట్‌రెడ్డి, మంజుల, దస్తప్ప, సాయిలు, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి సన్మానం


లక్ష్మిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13: హస్నాబాద్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు లక్ష్మి ఇటీవల ఢిల్లీలో ప్రధాని చేతుల మీదుగా జాతీయ ఉత్తమ పారిశుధ్య కార్మికురాలిగా అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డబ్ల్యూఈసీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రిన్సిపాల్ రాజారాం, అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక దృక్పథంతో ముందుకు సాగాలి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న గేయరచయిత డాక్టర్ జయరాజ్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13: సమాజంలో ప్రతీపౌరుడు సామాజిక దృక్పథంతో ముందుకు సాగాలని ప్రముఖ గేయరచయిత డాక్టర్ జయరాజ్ తెలిపారు. అంకుషాపూర్ ప్రిన్సిటన్ కళాశాల ఆవరణలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం కళాశాలలో మంగళవారం 'ప్రకృతి-పాట' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాధ్యతయుతంగా నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువినప్పుడే విజయాలు సొంతమవుతాయన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కో-ఆర్డినేటర్ నాగకల్యాణి, ప్రిన్సిపల్స్ హెచ్. రాధిక, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, అధ్యాపకులు పద్మమ్మ, దాసోజు పద్మావతి, సౌజన్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుదాం


సంతలో బ్యాగులు పంపిణీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దోమ, ఫిబ్రవరి 13: ప్రకృతిని కాపాడుదాం.. అభివృద్ధిని సాధించుకుందామని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాం రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సంతలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అనంతరం వ్యాపారులు, ప్రజలకు ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్, కార్యదర్శి నర్సింహులు, నాయకులు బందెయ్య, ఆంజనేయులు, నాగేంద్రం, మల్లేశం, నిరంజన్, రమేశ్ పాల్గొన్నారు.

ఇసుక పర్మిట్ల పరిశీలన

● నెంబర్లులేని ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ● తాండూరు మైన్స్ ఏడీ శ్యామెల్ జాకబ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరురూరల్, ఫిబ్రవరి 13: అనుమతులు లేకుండా ఇసుక తరలింపుపై అధికారులు స్పందించారు. 'ఇసుక అక్రమాలకు కొత్త దారులు' శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి తాండూరు మైన్స్ ఏడీ శ్యామెల్ జాకబ్ స్పందించి ఇసుక పర్మిట్లను పరిశీలించారు. తాండూరు మండలం ఖాంజాపూర్ గ్రామ శివారులోని కాగ్నా నది నుంచి తాండూరు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం కొంతమంది ఇసుక వ్యాపారులు సోమవారం 36ట్రిప్పుల ఇసుకను అనుమతులు పొంది తరలిస్తున్నారు. అయితే వీరిలో కొందరికి అక్రమార్కులు ట్రాక్టర్ ట్రాలీ నెంబర్ టీఎస్-34టీ9739ల పేరిట అనుమతులు పొంది మరో ట్రాక్టర్ ట్రాలీకి అదే నెంబర్ స్టిక్కర్ అతికించి ఒక ట్రాలీ ఇసుక రైల్వే స్టేషన్ తరలిస్తుండగా, ఇతర చోట్ల డంప్ చేసి ఇసుకను అమ్ముకుంటున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో తాండూరు మైన్స్ ఏడీ శ్యామెల్ జాకబ్ మండలంలోని ఖాంజాపూర్ గ్రామానికి వెళ్లి పర్మిట్లను పరిశీలించారు. గ్రామానికి వెళ్లి మైన్స్ ప్రతినిధి భరత్‌రెడ్డి 42ట్రిప్పులకు పర్మిట్లు జారీ చేయగా, వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే కొందరు ట్రాక్టర్లకు నెంబర్లు లేకపోవడంతో ఇక నుంచి ట్రాక్టర్‌కు ఇంజన్‌తోపాటు వెనుక ఇసుకను తీసుకెళ్లే ట్రాలీకి నెంబర్లు వేయించుకుని తరలించాలని ఆదేశించారు. అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ప్రాంతానికి పర్మిట్ పొందారో అదేప్రాంతంలో ఇసుక డంప్ చేయాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా డంప్ చేస్తే అట్టివారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై ట్రాక్టర్‌ను చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం పర్మిట్ల జారీలో సరైన ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఇసుక అక్రమార్కులు కొత్తదారులు వెతుకుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయంలో అటు పోలీసులు, ఇటు మైన్స్ రెవెన్యూ అధికారులు ఇసుక తరలింపు ట్రాక్టర్లపై నిఘా పెట్టాలని ఖాంజాపూర్ గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.



ఖాంజాపూర్ శివారులో ఇసుక పర్మిట్లను తనిఖీ చేస్తున్న మైన్స్ ఏడీ శ్యామెల్ జాకబ్

పాఠశాల భవనంపై సెల్‌టవర్ నిర్మాణం

● మున్సిపల్ కార్యాలయం ఎదుట కాలనీవాసుల ధర్నా
● అనుమతులు ఎలా ఇస్తారంటూ నిలదీత



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13: ఇళ్లమధ్య పాఠశాల భవనంపై నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీవాసులు మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. విద్యార్థులు, కాలనీవాసులపై రేడియేషన్ ప్రభావం పడే ప్రమాదుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజులుగా సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆందోళనలు చేయడంతో పాటు అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సెల్ టవర్‌పై మున్సిపల్ అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినా అందులో ఎక్కడా పాఠశాల భవనంపై సెల్ టవర్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొనకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా పొందిన సెల్‌టవర్ నిర్మాణ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నార్ల మల్లేష్ యాదవ్, చల్లా చిత్తరంజన్‌రెడ్డి, విజయ్, నారయణరెడ్డి, బంగారుబాబు, సామలశ్రీనివాస్, గౌరయ్య, మణేమ్మ పాల్గొన్నారు.

సుద్ద అక్రమ తరలింపునకు చెక్



మైన్స్ సిబ్బంది నిలిపివేసిన టిప్పర్లు

పెద్దేముల్, ఫిబ్రవరి 13: అక్రమంగా సుద్ద తరలింపునకు మైన్స్ అధికారులు చెక్ పెట్టారు. ఇన్నాళ్లు చూసీచూడనట్లు వ్యవహరించిన అధికారులు అక్రమాలపై సీరియస్‌గా తీసుకున్నారు. సుద్ద తరలిస్తున్న ప్రతీలారీలో రాయల్టీలను తనఖీచేస్తున్నారు. మండలంలోని మారెపల్లి, జనగాం, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్, రుద్రారం గ్రామాల పరిధిలో సుద్ద నిక్షేపాలు ఉన్నాయి. వాటిని తవ్వి తరలించేందుకు ప్రభుత్వం అనుమతులు తప్పనిసరి. అయితే ఇటీవల గనుల తవ్వకానికి లీజులు రావడం కష్టతరంగా మారింది. దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం నుంచి లీజులు రాకపోవడంతో కొంతమంది అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు. మరికొందరు ఐదెకరాల భూమి ఉంటే ఉంటే ఒకటి, రెండెకరాలకు లీజులు తీసుకుని అదే లీజుపై మొత్తం తవ్వుతున్నారు. తవ్విన గనులను మట్టితో మూసేసి ముందుకు తవ్వుతూ వెలుతున్నారు. అయితే లీజులు లేని గనుల్లో తవ్విన సుద్దను స్థానికంగా ఉండే ఫ్యాక్టరీలకు తరలిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లీజులు ఉన్నవారి వద్ద రాయల్టీలు తీసుకుని ఒక రాయల్టీపై నాలుగైదు ట్రిప్పుల సుద్దను తరలిస్తుంటారు. సుద్ద తరలిస్తున్న లారీలపై నజర్ లేకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆటగా సాగింది. దీంతో మైన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్తుండడంతో రెండు రోజులుగా మైన్స్ సిబ్బంది రోడ్లపై నిలబడుతున్నారు. సుద్దతో వెళ్తున్న ప్రతీటిప్పర్‌ను ఆపి రాయల్టీలు తనిఖీ చేస్తున్నారు. అయినా ఎక్కడో ఒక చోట అక్రమ తరలింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మైన్స్ సిబ్బంది సోమవారం మధ్యాహ్నం సుద్దతో వెళ్తున్న టిప్పర్‌ను నిలిపి రాయల్టీని పరిశీలించగా నిర్ణీత గడువు దాటిపోయి ఉండడంతో టిప్పర్లను అక్కడే నిలిపివేయించారు. ఉదయం 10.15గంటలకు తీసుకున్న రాయల్టీతో మధ్యాహ్నం 1.15లోపు సుద్దను తరలించేందుకు అనుమతి ఉంది. కానీ 1.30 గంటలకు లారీ రోడ్డుపైకి రావడంతో తనిఖీచేసిన సిబ్బంది గుర్తించి టిప్పర్లను నిలిపివేశారు. తిరిగి కొత్తగా రాయల్టీలు తీసుకువస్తేనే వదిలేస్తామని చెప్పడంతో వాటికి సంబంధించిన వ్యాపారులు తిరిగి కొత్తగా రాయల్టీలు తీసుకువచ్చి చూపడంతో సుద్ద టిప్పర్లను వదిలేశారు. దీంతో సుద్ద వ్యాపారుల్లో కొంత గుబులు మొదలైంది. అధికారులు తనిఖీలను కొనసాగిస్తే ప్రభుత్వం ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మట్టి రోడ్లకు మహర్దశ

● బషీరాబాద్‌కు
రూ.3 కోట్ల ఉపాధి నిధులు మంజూరు

బషీరాబాద్, ఫిబ్రవరి 13: గ్రామాలు, గిరిజన తండాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. మండలానికి 2023-24 సంవత్సరానికి గాను మెటిరీయల్ కంపోనెంట్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.3కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మట్టి రోడ్లకు మహర్దశ వచ్చింది. ఈ నిధులతో 35గ్రామ పంచాయతీల్లో అంతర్గత మట్టి రోడ్లను సీసీరోడ్లుగా మార్చనున్నారు. పంచాయతీల వారీగా నిధుల మంజూరీకి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బషీరాబాద్ గ్రామ పంచాయతీకి రూ.40లక్షలు, మైల్వార్, ఎక్మాయి, నవాంద్గీ, క్యాద్గీరా, జీవన్గి, దామర్‌చెడ్, వాల్యానాయక్‌తండా, కొర్విచెడ్, కొర్విచెడ్‌ఘని, నవాల్గ, భోజ్యానాయక్‌తండా, బాబునాయక్‌తండా, పర్వత్‌పల్లి, మర్పల్లి, మంతట్టి, రెడ్డిఘణాపూర్, కాశీంపూర్, కుప్పన్‌కోట్ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున, కంసాన్‌పల్లి(బి), మంతన్‌గౌడ్, మంతన్‌గౌడ్‌తండా, అల్లాపూర్, కొత్లాపూర్, మాసన్‌పల్లి, నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్, మాల్కన్‌గిరి, బద్లాపూర్, బద్లాపూర్‌తండా, గొట్టిగకలాన్, గొట్టిగఖుర్దు, కంసాన్‌పల్లి(ఎం) పంచాయతీలకు రూ.5లక్షల చొప్పున, నంద్యానాయక్‌తండా, జమ్లానాయక్‌తండాలకు రూ2.50 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. వారం రోజుల్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున కాంట్రాక్టర్లు పనులను వెంటనే ప్రారంభించి మార్చి 15లోపు సీసీరోడ్ల నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంటుందని ఏఈ వంశీకృష్ణ తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్, కమిషనర్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 13: మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, ఆర్జీకేకాలనీ, నారపల్లి, పోచారంలో రూ, 1.25కోట్లతో నిర్మించనున్న సీసీ, బీటీ, భూగర్భ డ్రైనేజీల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు సాయిరెడ్డి, హిమ, లక్ష్మి, సరిత, సుదాలక్ష్మి, పోచమ్మ, శ్రీలత, బద్దం మమత, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, ఏఈ నరేష్, నాయకులు మందడి సురేందర్‌రెడ్డి, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం తాగించాలి



చిన్నారులకు ద్రావణం తాగిస్తున్న ఆర్డీవో సాయిరాం, తదితరులు

చేవెళ్ల, ఫిబ్రవరి 13 : 9 నెలల నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం తాగించాలని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్‌తో కలిసి ఆర్డీవో సాయిరాం చిన్నపిల్లలకు ఏ విటమిన్ ద్రావణం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణంతో రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని అన్నారు. విటమిన్ లోపం కారణంగా రేచీకటి సమస్య వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుందని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేలురకం పశుగ్రాసాన్ని పండించాలి : ఏడీఏ



పశు వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ వసంతకుమారి, తదితరులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13: మేలురకం పశు గ్రాసాన్ని పండించాలని పాడి ఉత్పత్తులను పెంచుకోవాలని ఇబ్రహీంపట్నం పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పి.వసంతకుమారి రైతులకు సూచించారు. ఇబ్రహీంపట్నం పరిధి రాయపోల్ గ్రామంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ, సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న ఈ ప్రాంతంలో పాడి ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు. హైదరాబాద్ మహానగరానికి పాల ఉత్పత్తులు సరఫరా చేసుకునే అవకాశమున్నందున పాడి పరిశ్రమను మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు. శిబిరంలో 42 పశువులకు చూడి పరీక్షలు, 25 పశువులకు గర్భసంబంధ శస్త్ర చికిత్సలు చేశారు. అలాగే 40 దూడలకు నట్టల నివారణ మందులు, 35 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. ఎంపీటీసీలు గంగిరెడ్డి జ్యోతి భాస్కర్‌రెడ్డి, అచ్చన శ్రీశైలం, ఎలిమినేడు, మంచాల పశు వైద్యాధికారులు డా.సురేష్‌బాబు, డా.సుధ, సిబ్బంది కవిత, పురుషోత్తం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యాదయ్యకు జడ్పీటీసీ పరామర్శ



షాబాద్, ఫిబ్రవరి 13 : కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే యాదయ్యను ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అవినాష్ రెడ్డి సతీమణి సాన్విరెడ్డి, మొయినాబాద్ జడ్పీటీసీ శ్రీకాంత్ ఉన్నారు.

అవినీతికి పాల్పడితే ఉపేక్షించం



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 13 : మహేశ్వరం నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు వృత్తి ధర్మాన్ని మరిచి పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు అవినీతి, అక్రమాలకు పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించబోదని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో కొందరు అధికారులు అవినీతి, అక్రమాలకు తెరలేపారని, అలాంటి వారిని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఎక్కడకు పంపాలో.. అక్కడికే పంపుతుందన్నారు. పేద ప్రజలు వివిధ రకాల పనుల కొరకు కార్యాలయాలకు వస్తే వారిని పక్కకు పెట్టి బడాబాబుల పనులను చట్టవిరుద్ధంగా చేసి పెట్టిన అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని, అలాంటి వారి జాబితా తయారుచేసి స్థాన చలనం కల్పిస్తున్నారని తెలిపారు. అవినీతి, అక్రమాలు నిరూపితమైతే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రణాళికలు తయారు చేసిందన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు అధికారులపై ప్రత్యేక నిఘా పెట్టిందన్నారు. ధరణిని అడ్డం పెట్టుకొని రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్ చేసి నిబంధనలు తుంగలో తొక్కారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకునేందుకు రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారన్నారు. ధరణిని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ పెద్దలకు అప్పనంగా అప్పజెప్పిన అవినీతి అధికారులను ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టేదిలేదని కేఎల్లార్ హెచ్చరించారు.

భట్టికి కేఎల్లార్ పరామర్శ

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు మృతిపట్ల కేఎల్లార్ సంతాపం తెలిపారు. ఈమేరకు నగరంలోని ఏఐజీ ఆస్పత్రిలో భట్టి విక్రమార్కను కలిసి వెంకటేశ్వర్లు మృతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహానికి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నం ఏసీపీగా పీటర్ వత్సల రాజు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13 : ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు సైబరాబాద్ కమిషనరేట్ పరిధి శంషాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) డీఎస్పీ కె.పీటర్ వత్సల రాజును నియమిస్తూ డీజీపీ ర వి గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో 'ఎస్ఆర్ శ్రీగాయత్రి' విద్యార్థుల ప్రభంజనం

● 99 ప్లస్ స్కోర్ సాధించిన 18మంది విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థ యాజమాన్యం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13: ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్స్‌లో మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆదిబట్ల ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యా సంస్థలకు చెందిన 18 మంది విద్యార్థులు 99 ప్లస్ స్కోర్ సాధించినట్లు ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యా సంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌రెడ్డిలు తెలిపారు. ఈ ఫలితాలు పొందిన విద్యార్థులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)లో ప్రవేశానికి అర్హత సాధించినట్లు వారు తెలిపారు. కాగా, జేఈఈ మెయిన్స్‌లో మంచి స్కోర్ సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఫలితాల్లో కళాశాలకు చెందిన డి.మనీష్, టి.తేజస్వి, దిపాన్స్‌రెడ్డి, నిహాల్‌శ్రీవాత్సవ్, శ్రీరామ్‌రెడ్డి, సిద్దార్థరెడ్డి, వి.ప్రతీక్, సాయిప్రణతి, సూర్యతేజ, చెన్న కేశవరెడ్డి, ఎం.శ్రీవల్లి, చంద్రదీప్, సుబ్రమణ్యఆకాష్, వైశాలి, కమలవర్ధన్, ప్రగ్నతేజ, రాజీవ్, సాయియోగాభిలాష్. మొత్త 18 మంది విద్యార్థులు 99 ప్లస్ స్కోరు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్ శ్రీ గాయత్రి విద్యా సంస్థల డీజీఎం వాసుదేవ రెడ్డి, అకడమిక్ డీన్‌లు కె.శ్రీనివాస్, భరత్‌రెడ్డి, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సన్నద్ధమవ్వాలి



మాట్లాడుతున్న డీఈవో

షాద్ న గర్, ఫిబ్రవరి 13 : పరీక్షలు అనగానే ఆందోళనకు గురికావద్దని, రంగారెడ్డి జిల్లా విద్యా శాఖ అధికారి సు శీంద ర్‌రావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ హైస్కూల్లో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు చైతన్యం, అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివితే మెరుగైన ర్యాంకులు సొంతం అవుతాయని, పరీక్షలు అనగానే కంగారు పడేవారు అప్పటివరకు చదివింది కూడా మరిచిపోతారని సూచించారు. తప్పకుండా మెరుగైన ర్యాంకు సాధిస్తామన్న ధైర్యంతో ముందుకు సాగితే సులువుగా పరీక్షలు రాయగలుగుతారని తెలిపారు. ఎంఈవోలు శంకర్ రాథోడ్, కృష్ణారెడ్డి, మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు పరిహారం అందించాలి'

కడ్తాల్, ఫిబ్రవరి 13: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలని ఎమ్మార్పీఎస్ కడ్తాల మండల ఇన్‌చార్జి రమేశ్ మాదిగ కోరారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు పరిహారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేశ్ మాదిగ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు న్యాయం కోసం ప్రత్యేక న్యాయ వాదులను ఏర్పాటు చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బాధితుల బడ్జెట్‌ను దారిమళ్లించి బాధితులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు.


పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

ఆమనగల్లు, ఫిబ్రవరి 13 : దైవ కార్యక్రమాల్లో ప్రజలంతా పాలు పంచుకోవాలని, అవి సమాజ శాంతికి ఎంతగానో దోహదమవుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లిలో ఈనెల 14 నుంచి 18 వరకు జరిగే శ్రీ అలివేలుమంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన మంగళవారం మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యంతో కలిసి విడుదల చేశారు. పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తెస్తామన్నారు. అర్చక ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు వెంకటేష్, రాములు. జంగయ్య, భిక్షపతి తదితరులున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి


బ్యాగులను అందజేస్తున్న కొండ సాధన

షాబాద్, ఫిబ్రవరి 13 : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కేఎంఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు కొండ సాధన, అనురాధ అన్నారు. మంగళవారం సర్దార్‌నగర్ సంతలో వారు ప్రజలకు బ్యాగులను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అన్నారు. పర్యవరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మాణయ్య, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, నవీన్, విష్ణు, జనార్దన్, శ్రీధర్, సురేష్, రాము, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటుకు వినతి

తలకొండపల్లి, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పద్మ అనిల్ కోరారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆధార్ కేంద్రం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆధార్ నమోదు కోసం వెల్దండ, కల్వకుర్తి, ఊర్కొండపేట, మిడ్జిల్, జడ్చర్ల ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలని వినతి పత్రంలో కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2.20 కోట్లు మంజూరు

కడ్తాల్, ఫిబ్రవరి 13: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కడ్తాల మండలానికి నిధులు మంజూరైనట్లు డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలో 43 సీసీ రోడ్లుకు రూ. 2.20 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్కో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఆయా పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రెండో విడత మరికొన్ని గ్రామాలకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు చెప్పారు. సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కడ్తాల మండలంలో అసంపూర్తి పనులను త్వరిత గతిన పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు మల్లేశ్ గౌడ్, సత్యం, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించుకోవాలి

కడ్తాల్, ఫిబ్రవరి 13: బంజారాలు వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని కడ్తాల జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. తండాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని కోరారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం గిరిజనుల సంస్కృతి ఉట్టిపడేలా రూపొందించిన దొరసాని బంజార వీడియో సాంగ్ సీడీలు, పోస్టర్లను గిరిజన నేతలతో కలిసి దశరథ్ నాయక్ ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యనాయక్, నాయకులు శ్రీను, బీమన్, తదితరులున్నారు.

జూనియర్ కాలేజీని అభివృద్ధి చేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 13 : షాద్‌నగర్‌లోని జూనియర్ కళాశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈమేరకు అధ్యాపకులు, విద్యార్థులకు ఆయన హామీ ఇచ్చారు. ఈనెల 6న చదువుల నిలయం.. సమస్యల వలయం అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ మెంబర్ వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూర్ న్యాయ యాత్రలో భాగంగా ఆయనతో కలిసి జూనియర్ కళాశాలను సందర్శించారు.


కాలేజీని పరిశీలిస్తున్న శంకర్, వంశీచంద్‌రెడ్డి

ఈ సందర్భంగా వీర్లపల్లి మీడియాతో మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం బోధనకు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్య అని ఊరించిందని, ప్రభుత్వ కళాశాలల్లో ఏమాత్రం మౌలిక సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై దృష్టిసారించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కల్పించిందన్నారు. జూనియర్ కళాశాలను అభివృద్ధి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులకు హామీ ఇచ్చారు. వంశీ మాట్లా డుతూ వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేగా గెలిచాక విద్యపై దృష్టి సారించారని, డిగ్రీ కళాశాల మాదిరిగా జూనియర్ కాలేజీలో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తారని, అది సాధ్యంకాని యెడల కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్(సీఎస్ఆర్)ని ధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు.

మహిళల భద్రతే షీటీమ్ లక్ష్యం


మాట్లాడుతున్న షీటీమ్ ఏఎస్ఐ పద్మ

షాబాద్, ఫిబ్రవరి 13 : మహిళల భద్రతతే షీటీమ్ లక్ష్యమని షీటీమ్ చేవెళ్ల ఏఎస్ఐ పద్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శ్రీ చైతన్య స్కూల్లో మహిళల భద్రతపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని అన్నారు. కొందరు ఆకతాయిలు మహిళలు, విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. సైబరాబాద్ వాట్సాప్ నెంబర్ 9490617444కు లేదా చేవెళ్ల షీటీమ్ సెల్‌నెంబర్ 9493625379కు ఫోన్ చేస్తే వెంటనే పోలీసులు వచ్చి వారిపై తగిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ముఖ్యంగా బస్టాండ్, రోడ్డుపై వెళుతున్న మహిళలపై ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తిస్తే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అదేవిధంగా బాల్యవివాహాలు, సైబర్‌క్రైం, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ చట్టాలు, భరోసా సెంటర్, ఆపరేషన్ స్మైల్, విద్యార్థినుల భద్రతపై క్లుప్తంగా వివరించారు. కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, టీచర్ శ్రీరాములు, పోలీస్ సిబ్బంది వైద్యనాథ్, మల్లేశం, రవీందర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ , ఫిబ్రవరి 13 : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మండలంలోని మక్తమాదారం వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారికి మేలు కొలుపు పాడారు. అనంతరం ఆలయ అర్చకులు, ధర్మకర్త తిరుమల విజమూరు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో మూల విరాట్లను పట్టు వస్త్రాలతో అలంకరించి తిరుమంజనం, స్వస్తివాచనం, రక్షబంధనం, అంకురార్పన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉత్సవాల ప్రారంభంలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, అర్చకులు ఆదిత్య, రంగాచారి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


కడ్తాల : పూజల్లో పాల్గొన్న భక్తులు

స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించాలి

మంచాల : మండల పరిధిలోని ఆరుట్లలో శ్రీ రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, ఈ నెల 23 నుంచి 26 వరకు కల్యాణం, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సన్నాహక సమావేశం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఉత్సవాలకు సమీప గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, జాతరలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ చీరాల రమేష్ యంత్రాంగానికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ పాండాల జంగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు జనార్దన్‌రెడ్డి, కందాల పద్మ శ్రీశైలం, జానీపాష, ఎండీ సలాం, మాడ్గుల కృష్ణ, దండు మధుసూదన్ రెడ్డి, చిందం రఘుపతి, గుడ్డిమల్ల చంద్రయ్య, రమణారెడ్డి, మొర్రి ఐల య్య, పున్నం రాము, చిందం జంగయ్య, కావలి బుగ్గరాములు, రావుల బాష, సుంకరి ప్రవీణ్, మహేందర్‌యాదవ్, రమేష్, సికిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి


లక్ష్మయ్యను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 13 : ప్రభుత్వం రజకుల సమస్యలు పరిష్కరించాలని, అందుకు తగినట్లుగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా రజక సంఘం అధ్యక్షుడు అజయ్, చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో చేవెళ్ల మండల రజక సంఘం హడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చేవెళ్ల మండల రజక సంఘం అడ్‌హక్ కమిటీ చైర్మన్‌గా చేవెళ్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్యను ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా గుండాల శ్రీనివాస్, ఊరెళ్ల యాదయ్య, కుమార్, దీపక్, పాండు, ప్రభాకర్, శ్రీశైలం తదితరులను నియమించారు. అన్ని గ్రామాలను అనుసంధానం చేస్తూ అడ్‌హక్ కమిటీ వేయడం జరిగిందని, అన్ని గ్రామాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. మాజీ వార్డుసభ్యులు శ్రీనివాస్, అశోక్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్, జంగయ్య, మల్లేష్, శివకుమార్, రాజేశ్, శ్రీనివాస్, రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీలపై మంత్రి ఉత్తమ్ మాటలు సరికాదు'

కడ్తాల్, ఫిబ్రవరి 13: గ్రామ పరిపాలన కేంద్రాలైన గ్రామ పంచాయతీలను చులకన చేసి మాట్లాడడం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తగదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో సోమవారం పలు విషయాలపై జరుగుతున్న చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావు ను ఉద్దేశించి గ్రామ పంచాయతీల్లో మాట్లాడినట్లు చిల్లరగా మాట్లాడుతున్నావని ప్రస్తావించడం తెలంగాణలో ఉన్న 12,769 గ్రామ పంచాయతీలకు అవమాన పరిచినట్లే అన్నారు. రాజకీయాలకతీతంగా గ్రామ పంచాయతీల్లో ప్రశాంతమైన వాతావరణంలో అభివృద్ధి పనులపై చర్చించి ప్రజలందరి అభిప్రాయానికనుగుణంగా తీర్మానాలు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీలకు అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, మాజీ సర్పంచ్ లు తులసీరామ్‌నాయక్, కృష్ణయ్య, శ్రీను నాయక్, నాయకులు గురిగళ్ల రామచంద్రయ్య, మూడ అశోక్, రాజేందర్ యాదవ్, జగన్‌యాదవ్, మహేశ్, శ్రీకాంత్, శ్రీశైలం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి'పై కేసీఆర్‌వి బూటకపు మాటలు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 13: పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల ప్రాజెక్ట్‌పై కేసీఆర్ బూటకపు మాటలు మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. మూడు రోజుల పాటు షాద్‌నగర్ నియోజకవర్గంలో నిర్వహించిన పాలమూరు న్యాయ యాత్ర మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం, కిషన్‌నగర్, హాజీపల్లి గ్రామాల్లో కొనసాగింది. మంగళవారం సాయంత్రం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ నల్లగొండ సభలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ను 80 శాతం పూర్తి చేశామని అబద్ధాలు మాట్లాడారని బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. ప్రాజెక్ట్ 80 శాతం పూర్తయితే 10 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందాలని, ఎన్ని ఎకరాలకు నీరు అందించారో చెప్పాలన్నారు. ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా కేసీఆర్‌కు బుద్ధి రాలేదని, మరోసారి ప్రజలకు అబద్ధాలు చెప్తున్నారన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీలు వెంకట్‌రాం రెడ్డి, విశాల, నాయకులు బాబర్‌ఖాన్, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, రఘు, కాశినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న నాయకులు

విద్యార్థులు కష్టపడి చదవాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 13 : విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు, న్యాయవాది కోమటిరెడ్డి లక్ష్మీనర్సింహరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. మండలంలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ సొంత ఖర్చులతో చదివిస్తానన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరహరి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, ఎంటీసీ భవానియాదగిరి, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లగొండ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 13: కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నల్లగొండలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు ఆమనగల్లు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు ఆధ్వర్యంలో ఉదయం వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు ఆమనగల్లు పట్టణానికి చేరుకున్నారు. బీఆర్ఎస్, కేసీఆర్ కు అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలలో నల్లగొండ సభకు బయలు దేరి వెళ్లారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం బీఆర్ఎస్ ఎంతటి పోరాటాలకైన వెనుకాడబోదని అర్జున్ రావు పేర్కొన్నారు. నాయకులు పరమేశ్, వెంకటయ్య, కుమార్, కృష్ణయ, జంగయ్య, కేశయ్య, తదితరులున్నారు. కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, కల్వకుర్తి, వెల్దండ మండలాల నుంచి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు నల్లగొండ సభకు తరలి వెళ్లారు.నాయకులు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, దశరథ్ నాయక్, బావండ్లపల్లి ఆనంద్, నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, జక్కు అనంత రెడ్డి, గంప వెంకటేశ్, గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి, కడారి రామకృష్ణ, లాయక్‌అలీ, జైపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

యాచారం : నల్గొండలో జరిగిన బీఆర్ఎస్ సభకు యాచారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు బస్సుల్లో తరలివెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను విస్మరించిందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పి.బాషా ఈ సందర్భంగా మాట్లాడుతూ విమర్శించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు రమేష్‌గౌడ్, రామచంద్రయ్య, బీఆర్ఎస్ నాయకులు ఖాజు, యాదయ్య, రమేష్, లిక్కి నర్సింహా రెడ్డి తదితరులున్నారు.

మంచాల : నల్లగొండలో బీఆర్ఎస్ బహిరంగ సభకు మండలానికి చెందిన ముఖ్యనేతలు తరలివెళ్లారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చీరాల రమేష్, బహదూర్, జానీపాష, కందాళ శ్రీశైలం, మావిళ్ల వెంకటేష్ యాదవ్, పున్నం రాము, కాటి కృష్ణ, శంకర్‌నాయక్, లాలగారి జంగయ్య, శ్రీకాంత్, వినోద్ తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : కృష్ణా నీటి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే కుట్రలను నిరసిస్తూ మంగళవారం నల్లగొండలో జరిగిన బీఆర్ఎస్ సభకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో సభకు చేరుకున్నారు.

● **మాడ్గుల :** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం సభకు బీఆర్ఎస్ మాడ్గుల మండలాధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి, నాయకులు లాలయ్యగౌడ్, గ్యార వెంకటయ్య, అనిల్, చెన్నకేశవులు, సత్తయ్య, బక్కయ్య, వీరయ్య చలమందలు తరలివెళ్లారు.

సంక్షిప్తంగా..

● **తలకొండపల్లి :** పాలమూరు ప్రగతి కోసం ఏఐసీసీ అగ్రనేత రాహుల్ స్ఫూర్తితో ఏఐసీసీ కార్యదర్శి , మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి చేపట్టిన న్యాయ్ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం ప్రభాకర్ రెడ్డి న్యాయ్ యాత్రలో పాల్గొన్నారు. వంశీచంద్ రెడ్డితో కలిసి కేశంపేట మండలంలో వారు పర్యటించారు. న్యాయ్ యాత్రకు సంఘీభావం ప్రకటించారు. భగవాన్‌రెడ్డి, అజీం, రవీందర్ యాదవ్, శశీధర్ రెడ్డి, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు మల్లేశ్ గౌడ్, సత్యం యాదవ్, వెంకటేశ్, జహంగీర్‌బాబా, రాజేశ్, హీరాసింగ్, తులసీరామ్ నాయక్, జవహర్‌లాల్, చెన్నయ్య, బాల్‌రాజ్, శ్రీశైలం, ఎక్బాల్, జగన్, కృష్ణనాయక్, తదితరులు న్యాయ్ యాత్రలో పాల్గొని వంశీచంద్ రెడ్డితో కలిసి పాద యాత్ర చేశారు.

● **యాచారం :** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణగుప్తపై రైతులు దాడిచేసి అవమానించడం దారుణమని యాచారం మండల ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు వి. శ్రీనివాస్ గుప్త, లక్ష్మణ్‌గుప్తలు తీవ్రంగా ఖండించారు. ఆ ర్యవైశ్యులు రాజకీయంగా రాణించడాన్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు రైతుల ముసుగులో దాడులు చేయడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

చౌదరిగూడ, ఫిబ్రవరి 13 : ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు మంగళవారం వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన మోహన్ సాకేత్(20) ఆరు నెలలగా లాల్‌పహాడ్‌లోని జీబీ బేకర్స్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అయితే, మధ్యప్రదేశ్‌లో తాను ప్రేమించిన అమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని సూసైడ్ చేసుకుంది. ఈ విషయం సాకేత్‌కు తెలియడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి తాను ఉండే గదిలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన బావ అర్జున్ సాకేత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తలకొండపల్లి, ఫిబ్రవరి 13 : రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని చంద్రధన గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. చంద్రధనకు చెందిన నాగుల సుభాష్ తన భార్య సునీతతో కలిసి బైక్‌పై వెల్జాల గ్రామానికి సంతకు వెళ్లారు. కూరగాయలు తీసుకొని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో చంద్రధన గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. దాంతో వెనకాల కూర్చున్న నాగుల సునీత(39) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి సివిల్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగికదాడి నిందితుడికి మూడేళ్ల జైలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 13 : లైంగికదాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి మంగళవారం తీర్పు వెలువరించారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో జరిగిన ఘటనకు సంబంధించి నమోదైన కేసులో రేప్ కేసులో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా రాయపోల్ గ్రామానికి చెందిన దొంకంటి శివకుమార్‌కు మూడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించారు. కాగా, బాధితులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

మహేశ్వరం ఎంపీడీవోగా శైలజ


బాధ్యతలు స్వీకరిస్తున్న శైలజ

మహేశ్వరం, ఫిబ్రవరి 13 : మహేశ్వరం మండలానికి నూతనంగా బదిలీపై వచ్చిన ఎంపీడీవో పిశైలజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన నర్సింహులు బదిలీపై వికారాబాద్ జిల్లాకు వెళ్లగా వికారాబాదు జిల్లా మోమిన్‌పేట మండల ఎంపీడీవోగా పనిచేసిన శైలజ బదిలీపై మహేశ్వరం వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, తోటి సిబ్బంది సహకారంతో ప్రభుత్వ పథకాల అమలుతో పాటు మండలాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన యాచారం ఎంపీడీవో


ఎంపీడీవో నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ సుకన్యబాషా

యాచారం, ఫిబ్రవరి 13 : యాచారం మండ ల పరిషత్ అభివృద్ధి అధికారిగా నరేందర్‌రెడ్డి మంగళవారం పదవీ బా ధ్యతలు స్వీకరించారు. ఆయన యాదాద్రి భువనగిరిజిల్లా భువనగిరి మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో విజయలక్ష్మి వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా ఎంపీడీవోను ఎంపీపీ కొప్పు సుకన్యబాషాతో పాటు కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలి


శంషాబాద్ : మాట్లాడుతున్న నీరటి మల్లేష్

శంషాబాద్/యాచారం, ఫిబ్రవరి 13 : ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు నీరటి మల్లేష్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భగా పార్టీ మండల కన్వీనర్ నీరటి మల్లేష్ మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టి పదేళ్లు పూర్తయినా కార్పొరేట్‌కు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తోందని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లు-2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు సామ్యేల్, నాగేష్, రాములు, విజయ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల రైతులు ఢిల్లీలో ఆందోళనకు దిగుతుంటే రహదారులు మూసివేయడం దారుణమన్నారు. మంగళవారం సాయంత్రం యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్ తదితర గ్రామాల్లో సీపీఎం కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కోరారు. నిత్యావసరసరకుల ధరలు అదుపులో పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అనంలో ఉన్న వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమ దోపిడికి గురికాకుండ సీపీఎం నిరంతరం శ్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, కృష్ణ జంగయ్య తదితరులున్నారు.

26 నుంచి పోత్‌గల్ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు

షాబాద్, ఫిబ్రవరి 13 : ఈ నెల 26 నుంచి శ్రీ సూర్య డెవలపర్స్ ఆధ్వర్యంలో పోత్‌గల్ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పామెన నర్సింహులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని డాక్టర్ పీఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించారు. 26 నుంచి నిర్వహించనున్న డివిజన్ స్థాయి క్రీడా పోటీలను గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నందున క్రీడాకారులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గెలుపొందిన, మంచి ప్రతిభ కనబర్చిన జట్లకు, క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.లక్ష నగదుతో పాటు ట్రోఫీ, ద్వితీయ బహుమతి రూ.50వేలు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎంట్రీఫీజు రూ.20వేలు, నిర్వాహక కమిటీ 8096618994, 9182077449 నెంబర్లను సంప్రదించి ఎంట్రీ నమోదు చేసుకోవాలన్నారు.

బీజేపీ బైర్ఖాన్‌పల్లి నూతన కమిటీ


నియామకపత్రం ఇస్తున్న రాఘురాములు

కేశంపేట, ఫిబ్రవరి 13 : మండల పరిధిలోని బైర్ఖాన్‌పల్లిలో బీజేపీ గ్రామ నూతన కమిటీని మంగళవారం ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాఘురాములు గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోగికర్ నర్సింగ్, ప్రధాన కార్యదర్శిగా బంధం సురేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆయన నియామక పత్రాలు అందించారు. అదేవిధంగా గ్రామంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. తట్టెపల్లి నర్సింహ, దన్నెడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.